సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
బుధవారం
26-03-2025
పేజీలు: 02



# శాసనమండలి ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన

శాసనమండలి ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన వ్యక్తం చేసింది. హామీల అమలు కోసం వినూత్న తరహాలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తుంది. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ కింద తులం బంగారం ఇచ్చే హామీని అమలు చేయాలని వినూత్నంగా కారు పార్టీ ఎమ్మెల్సీల నిరసన చేశారు. తక్షణమే తులం బంగారం ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బంగారు కడ్డీలను పోలిన వాటిని ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు తెలిపారు. ఇప్పటి వరకు పెళ్లైన వారికి కూడా తులం బంగారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. తులం బంగారం కోసం ఆడ పిల్లల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. ఇక, శాసన మండలిలో బీఆర్ఎస్ ప్రతిపక్ష నేత మధుసూదన చారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చారు.. కేసీఆర్ ప్రభుత్వం ఆడ పిల్లలకు కళ్యాణ లక్ష్మీ కింద లక్ష రూపాయల స్కీం ప్రవేశ పెట్టారు.. అనేక వర్గాల ప్రజలను ఆదుకున్నారు కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా లోకానికి తీవ్ర మనస్తాపానికి గురి చేసింది.. తులం బంగారం ఇవ్వలేదు, నెలకు 2500 ఇవ్వలేదు.. కాంగ్రెస్ పార్టీ మహిళా లోకాన్ని మోసం చేసింది.. సెంటిమెంట్ ఉపయోగించి నమ్మించి మోసం చేశారు.. తెలంగాణలో దుర్మార్గపు పాలన నడుస్తుంది అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తక్షణమే పెళ్లైన అమ్మాయిలకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డికి మహిళా లోకం బుద్ధి చెబుతారు.. ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూడాలి అని కోరారు.

# నకిరేకల్ పీఎస్‌లో కేటీఆర్‌పై 2కేసులు నమోదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేటీఆర్‌తో పాటు సోషల్‌మీడియా ఇంచార్జిలు మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌పై కేసులు నమోదు చేశారు. నకిరేకల్ పదో తరగతి తెలుగు పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ కేసులోని నిందితులతో తమకు సంబంధం లేకున్నా సోషల్‌మీడియా వేదికగా తమపై తప్పుడు ప్రచారం చేశారంటూ నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత, మరో వ్యక్తి ఉగ్గిడి శ్రీనివాస్ వేర్వేరుగా నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పేపర్ లీకేజీ కేసులోని నిందితులతో తమకు సంబంధం ఉందంటూ తెలుగు స్క్రైబ్‌లో వచ్చిన కథనాన్ని కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్)లో షేర్ చేసినట్లు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. చౌగోని రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నెంబర్ 85/2025 నమోదు చేశారు. ఇందులో ఏ 1గా మన్నె క్రిశాంక్, ఏ 2 గా కేటీఆర్, ఏ 3గా కొణతం దిలీప్ కుమార్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఉగ్గిడి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నెంబర్ 86/2025 ను నమోదు చేశారు. ఇందులో ఏ1 గా కొణతం దిలీప్ కుమార్ , ఏ2గా



మన్నే క్రిశాంక్, ఏ 3గా కేటీఆర్, ఏ4 గా తెలుగు స్క్రైబ్ ఎండీ, ఏ5 గా మిర్రర్ టీవీ యూట్యూబ్ ఛానెల్ ఎండీతో పాటు మరికొందరిపైనా రెండు కేసుల్లోనూ 353(1)(c), 353(2) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు నకిరేకల్ పోలీసులు తెలిపారు.



## ధోనితో ఐశ్వర్య ఫ్యాన్ మూమెంట్

ప్రస్తుతం క్రికెట్ అభిమానులు ఐపీఎల్ 2025 ఫీవర్‌తో ఊగిపోతున్నారు. ఇప్పటికే ఈ టోర్నీలో చాలా ఆసక్తికర మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఇక తమ అభిమాన క్రికెటర్ల ఆటను చూసేందుకు అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, క్రికెట్ ప్లేయర్స్‌కు కేవలం కామన్ పబ్లిక్ మాత్రమే కాకుండా సెలెబ్రిటీలు సైతం అభిమానులుగా ఉంటారు. తాజాగా ఓ స్టార్ క్రికెటర్‌తో తన ఫ్యాన్ మూమెంట్ చూపెట్టింది ఓ హీరోయిన్. ఇటీవల 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ప్రేక్షకులకు దగ్గరయ్యింది అందాల భామ ఐశ్వర్య రాజేష్. ఈ బ్యూటీ తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ప్లేయర్ ఎం.ఎస్.ధోనితో సెల్ఫీ దిగింది. ఈ ఫోటోలను ఆమె తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేసింది.




## వెంటాడే సొంతూరి జ్ఞాపకాలు

ఇంటి చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు.. బంధాల నేపథ్యంలో రూపొందిన వెబ్ సిరీస్ 'హోంటౌన్'. రాజీవ్ కనకాల, ఝాన్సీ, ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనీ, అనిరుధ్, జ్యోతి ప్రధాన పాత్రధారులు. శ్రీకాంత్‌రెడ్డి పల్లే దర్శకుడు. నవీన్ మేడారం, శేఖర్ మేడారం నిర్మాతలు. ఏప్రిల్ 4న ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహాలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సిరీస్ ట్రైలర్‌ని అగ్రహీరోగా విజయ్ దేవరకొండ మంగళవారం విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'బ్రతుకుతెరువు కోసం సొంతూర్లను విడిచిపెట్టినా.. ఊరి జ్ఞాపకాలు మాత్రం మనల్ని విడిపెట్టవ్. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసేలా ఈ సిరీస్ ఉంటుంది' అని మేకర్స్ చెబుతున్నారు. కుటుంబ సంఘర్షణల నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ ట్రైలర్ సాగింది. రాజీవ్‌కనకాల, ఝాన్సీ, అనీ.. తదితరులు ట్రైలర్‌లో ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి కెమెరా: దేవ్‌దీప్ గాంధీ కుండు, సంగీతం: సురేష్ బొబ్బిలి.




## కంటైనర్‌ను ఢీకొట్టిన రెండు ట్రావెల్స్ బస్సులు..
## 13 మందికి తీవ్రగాయాలు

యాదాద్రి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున భారీ కంటైనర్‌ను రెండు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు వెనుక నుంచి ఢీకొట్టాయి. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. దీంతో డ్రైవర్‌ను బయటకు తీయడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కాగా, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు గంటల పాటు శ్రమించి వాహనాలను ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేశారు.



## యంగ్ బ్యూటీలకు కాజల్ ఛాలెంజ్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తెలుగు ప్రేక్షకులను ఎంతలా అలరించిందో తెలిసిందే. దాదాపు 20 ఏళ్ల పాటు చలన చిత్ర పరిశ్రమలో యాక్టివ్ గా కనిపిస్తోంది. వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూనే వస్తోంది. 'లక్ష్మి కళ్యాణం', 'చందమామ' వంటి చిత్రాలతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. తొలి చిత్రాలతోనే ఆడియెన్స్ నుంచి మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. తన టాలెంట్ తో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చింది. కాజల్ అగర్వాల్ ముంబైలో పుట్టి పెరిగినప్పటికీ టాలీవుడ్ చిత్రాలతోనే మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. మహారాష్ట్రలోని బాంబే పట్టణంలో ఈ బ్యూటీ 1985 జూన్ 19న జన్మించింది. వాళ్ల తండ్రి విజయ్ అగర్వాల్ బిజినెస్ మ్యాన్ కావడం విశేషం. ఉన్నదన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆమె కూడా తెలుగులో పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది. అయితే, కాజల్ అగర్వాల్ వరుస సినిమాలతో ఓవైపు ప్రేక్షకులను అలరిస్తూనే మరోవైపు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా కనిపిస్తోంది.



## ఏటీఎం నుంచి క్యాష్ విత్‌డ్రా...
## ఛార్జీలు పెంచిన ఆర్బీఐ

భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణపై (క్యాష్ విత్‌డ్రా) ఇంటర్‌ఛేంజ్ ఛార్జీలను పెంచింది. దీనితో.. 2025, మే 1 నుంచి భారతదేశంలో ఏటీఎం నుంచి డబ్బు తీసుకోవడం మరింత ఖరీదైనదిగా మారుతుంది. తరచుగా ఏటీఎంలు ఉపయోగించే వినియోగదారులపై ఈ మార్పు ప్రభావం చూపుతుంది. ఈ ఛార్జీల పెరుగుదల వల్ల క్యాష్ విత్‌డ్రా చేసుకోవడం మరింత ఖర్చుతో కూడుకున్నదిగా మారుతుందని డీడీ న్యూస్ రిపోర్ట్ పేర్కొంది. ఒక బ్యాంకు కస్టమర్లకు ఏటీఎం సేవలను అందించినందుకు మరొక బ్యాంకుకు చెల్లించే ఛార్జీనే ఏటీఎం ఇంటర్‌ఛేంజ్ ఫీజు అంటారు. బ్యాంకులు ఈ ఛార్జీలను వినియోగదారులకు వారి బ్యాంకింగ్ రుసుముల్లో భాగంగానే విధిస్తాయి.




## ఉమ్మడి కడప జిల్లాలో పదోతరగతి ప్రశ్నపత్రం లీక్

ఉమ్మడి కడప జిల్లాలో పదోతరగతి ప్రశ్నపత్రం లీక్. పేపర్ లీక్ వ్యవహారంలో ముగ్గురుని సస్పెండ్ చేసిన డీఈవో. సస్పెండ్ చేసిన డీఈవోకు బెదిరింపులు. పదోతరగతి విద్యార్థులకు గణితం పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల వ్యవధిలో వాట్సాప్లో దర్శనమిచ్చిన ప్రశ్నపత్రం . ఓ వ్యక్తి నేరుగా డీఈవో షంషుద్దీన్ కు సమాచారం చేరవేయడంతో ఆయన ఆ ప్రశ్నపత్రంలోని క్యూఆర్ కోడ్ ఆధారంగా వల్లూరు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నపత్రం లీక్ అయినట్లుగా గుర్తింపు. వల్లూరు మండలంలో ఒకటి, వేంపల్లె మండలంలో రెండు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అండతో ఈ ఘటన చోటుచేసుకుందని సమాచారం. పరీక్ష మొదలైన నిమిషాల వ్యవధిలో వల్లూరు పరీక్ష కేంద్రంలోకి వాటర్ బాయ్ సాయిమహేష్, విఘ్నేశ్వర రెడ్డి అనే ఉపాధ్యాయుడు వెళ్లి ప్రశ్నపత్రం ఫొటో తీసి, వాట్సాప్ ద్వారా వేంపల్లెలోని కొంతమంది ప్రైవేట్ పాఠశాల యాజ మాన్యాలకు చేరవేస్తున్నారని విచారణలో తేలినట్లు చెబుతున్నారు. పశ్నపత్రం లీకు వ్యవహారంలో చీఫ్ సూపరింటెండెంట్ ఎం.రామ కృష్ణమూర్తి, డిపార్ట్మెంటల్ అధికారి ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఇన్విజిలేటర్ ఎం. రమణ సస్పెండ్ చేసిన డీఈవో షంషుద్దీన్.

## డేవిడ్ వార్నర్‌కి రాజేంద్ర ప్రసాద్ క్షమాపణ!

యూత్ స్టార్ నితిన్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కించిన అవైటెడ్ సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రం "రాబిన్ హుడ్" కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం ఇపుడు రిలీజ్ కి దగ్గర పడుతున్న సమయంలో మేకర్స్ ప్రమోషన్స్ ని ఫుల్ స్వింగ్ లో కూడా చేస్తున్నారు. అయితే ఈ చిత్రంలో ప్రముఖ ఆస్ట్రేలియన్ డాషింగ్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం తోనే వార్నర్ వెండి తెర పరిచయం కూడా ఇవ్వబోతున్నారు. అయితే ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ లో ఇటీవల సీనియర్ నటుడు నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ వార్నర్ పై చేసిన పలు వ్యాఖ్యలు అభ్యంతరకరంగా మారాయి. మరి ఈ వ్యాఖ్యలపై తాజాగా రాజేంద్ర ప్రసాద్ స్పందించారు. నాకు వార్నర్ అంటే ఎంతో



ఇష్టం అతనికి మన సినిమాలు అంటే ఎంతో ఇష్టం అని తెలిపారు. అయితే వార్నర్ ని తాను ఉద్దేశ పూర్వకంగా అనలేదు అని ఒకవేళ ఈ విషయంలో ఎవరైనా బాధించబడి ఉంటే వారికి క్షమాపణలు తెలుపుతున్నాను అని రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. దీనితో తన లేటెస్ట్ క్లారిటీ ఇపుడు వైరల్ గా మారింది.

## బుకింగ్స్ లో "ఎంపురాన్" సెన్సేషన్!

మళయాళ సినిమా బిగ్గెస్ట్ స్టార్స్ లో ఒకరైన మోహన్ లాల్ హీరోగా పృథ్వీ రాజ్ సుకుమారన్ నటుడుగా అలాగే దర్శకునిగా కూడా చేసిన లేటెస్ట్ సాలిడ్ చిత్రమే "ఎంపురాన్". తమ బిగ్గెస్ట్ హిట్ లూసిఫర్ కి సీక్వెల్ గా ఎల్ 2 ఈ ఎంపురాన్ పేరిట తెరకెక్కించిన ఈ సినిమాపై మళయాళ సినిమాలో ఏ చిత్రానికి లేని భారీ హైప్ నెలకొంది. ఇలా బుకింగ్ ఓపెన్ చేసుకున్న ఈ చిత్రం కేవలం వీటితో రికార్డులు స్టార్ట్ చేసింది. గంటలో సహా డే 1 కి కూడా ఆల్ టైం హైయెస్ట్ నంబర్స్ సెట్ చేసిన ఈ చిత్రం ఇపుడు వీకెండ్ కి ఏకంగా 70 కోట్ల రేంజ్ బుకింగ్స్ ని వరల్డ్ వైడ్ గా నమోదు చేసుకున్నట్టు తెలుస్తుంది.



సూర్య www.suryaa.com EVENING EDITION 4 PM

# అది మనుషుల్ని చంపడం కన్నా ఘోరం: సుప్రీం



పర్యావరణాన్ని తమ కళ్లెదుటే నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని.. ఇలాంటి చర్యలను అడ్డుకట్ట ఎలా వేయాలో తమకు బాగా తెలుసని దేశ సర్వోన్నత న్యాయస్థానం అంటోంది. చెట్లను నరికిన వ్యవహారంలో ఓ వ్యక్తికి భారీ జరిమానా విధించిన కోర్టు.. ఇలాంటి చర్యలు మనుషుల్ని చంపడం కన్నా ఘోరం అంటూ వ్యాఖ్యానించింది. తాజ్ ట్రాపిజెమ్ జోన్ పరిధిలోని మధుర-బృందావన్‌లో దాల్మియా ఫార్మ్స్ నిర్వాహకుడు శివ్ శంకర్ అగర్వాల్.. చెట్లు నరికిన కేసులో ఊరట కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. అయితే ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజల్ భుయాన్ ధర్మాసనం అక్రమంగా నరికిన ప్రతీ చెట్టుకు లక్ష రూపాయాల జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చింది. అనుమతి లేకుండా అన్నేసి చెట్లు నరకడం అన్నింటికంటే ఘోరం. అంత వృక్షసంపదతో పచ్చదనం మళ్లీ కావాలంటే కనీసం వందేళ్లైనా పట్టొచ్చు. ఇది మనుషుల్ని చంపడం కంటే పెద్ద నేరం. ఇలాంటి చర్యలను చూస్తూ ఊరుకోలేం. కాలుష్య ప్రభావం రాబోయే తరాల మీద పడకుండా చూడాలంటే చెట్లు అవసరం.వాటిని పరిరక్షించడం మన అందరి బాధ్యత అని అభిప్రాయపడింది. ఇక.. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కోర్టుకు ఓ నివేదిక సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగానే కోర్టు చెట్టుకు లక్ష చొప్పున .. రూ.4 కోట్ల 54 లక్షల జరిమానా కట్టాలని ఆదేశించింది. అయితే.. అగర్వాల్ తరఫున వాదనలు వినిపించిన ముకుల్ రోహత్గీ.. తన క్లయింట్ తప్పును ఒప్పుకుని క్షమాపణలు చెప్పాడని, అందుకు సంబంధించి అఫిడవిట్ కూడా కోర్టుకు సమర్పించామని తెలియజేశారు. అయినప్పటికీ జరిమానా విషయంలో ధర్మాసనం అస్సలు తగ్గలేదు. మరోవైపు సమీపంలోని స్థలంలో తోటలు వేసుకునేందుకు అగర్వాల్ అనుమతి కోరగా.. అతనిపై దాఖలైన ధిక్కార పిటిషన్‌ను విచారణ తర్వాతే ఆ అంశంపై నిర్ణయం ప్రకటిస్తామని తెలిపింది. ఈ సందర్భంగా.. జోన్‌లోని అటవీయేతర, ప్రైవేట్ భూములలోని చెట్లను నరికివేయడానికి ముందస్తు అనుమతి పొందాలనే నిబంధనను తొలగిస్తూ 2019లో ఇచ్చిన ఉత్తర్వులను కూడా సుప్రీంకోర్టు గుర్తుచేసుకుంది. తాజ్ ట్రాపిజెమ్ జోన్‌ను కేంద్రం 1986లో పర్యావరణ పరిరక్షణ చట్టం కింద ఏర్పాటు చేసింది. కాలుష్య కోరల్లోంచి తాజ్ మహల్‌తో పాటు ఇతర వారసత్వ సంపదలను పరిరక్షించే ఉద్దేశంతో ఈ జోన్‌ను తీసుకొచ్చారు. మొత్తం 10,400 స్క్వేర్ కిలోమీటర్ల ప్రాంతం ఇది. ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లో కొంత భాగం కూడా ఉంది. అత్యంత సున్నిత ప్రాంతంగా పేరున్న టీటీజెడ్ పర్యవేక్షణ కోసం ప్రత్యేక కాలుష్య నియంత్రణ మండలి కూడా ఉంది. అయితే.. 2019లో సుప్రీం కోర్టు టీటీజెడ్‌లో చెట్లను తొలగించడం కోసం ముందస్తు అనుమతి తీసుకోవాలన్న నిబంధనను ఎత్తేసింది. వ్యవసాయ, పశుపోషణ సంబంధిత కార్యకలాపాల కోసం చెట్లను తొలగించడంలో తప్పేమీ లేదని అభిప్రాయపడింది. అయితే తర్వాతి రోజుల్లో ఆ ఉత్తర్వులను సమీక్షించిన సర్వోన్నత న్యాయస్థానం 2019 నాటి ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు స్పష్టం చేసింది.

## Spring Is in The Air (SIITA) Ameenpur గేటెడ్ కమ్యూనిటీ ఘనంగా రంజాన్ వేడుకలు జరుపుకుంది!




SIITA Ameenpur నివాసితులు రంజాన్ పండుగ ను ఐక్యత మరియు వైవిధ్యానికి నిజమైన నిదర్శనంగా జరుపుకున్నారు. ఈ వేడుక సమాజంలోని అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చి, సోదరభావం, సామరస్యము, పరస్పర గౌరవం అనే విలువలను బలపరిచింది. ఈ సంబరాలు "గంగా-జమునా తహజీబ్" స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, సాంస్కృతిక ఐక్యత మరియు సహజీవనానికి ప్రతీకగా నిలిచాయి. SIITA నివాసితులు ఈ భావాన్ని ఆలంబన చేసుకుంటూ "ఐక్యతలోనే శక్తి, వైవిధ్యంలోనే అందం" అని ప్రామాణికంగా నిరూపించారు. ఈ వేడుకను విజయవంతం చేయడంలో ఫెస్టివల్ కమిటీ సభ్యులు — షేక్ రబ్బాని, చక్రవర్తి, నదీమ్ హుస్సేన్, సైనాథ్, వినయ్ డామా, వినయ్ కుమార్ రెడ్డి, విను రెడ్డి, రవి కుమార్ రెడ్డి మరియు ఇతరుల పాత్ర కీలకం. వారి అంకితభావంతో ఈ వేడుక మరింత ఘనంగా జరిగింది. SIITA నివాసితుల ఉత్సాహం, భాగస్వామ్యం ఈ వేడుకకు మరింత ఆనందాన్ని అందించింది. ఈ సందర్భంగా రంజాన్ పవిత్రతను గౌరవిస్తూ ప్రత్యేక భోజన విందు ఏర్పాటు చేయడం జరిగింది, ఇందులో మటన్ బిర్యానీ, వెజ్ బిర్యానీ, మిర్చీ కా సలాన్, రాయితా, డబుల్ కా మీఠా వంటివి సమర్పించబడ్డాయి. ఈ రుచికరమైన విందును అందరూ ఆస్వాదించి, పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. SIITA Ameenpur మరోసారి వైవిధ్యం గౌరవిస్తూ, ఐక్యతను ప్రోత్సహిస్తూ తన సమాజ సేవా విలువలను ప్రపంచానికి చాటిచెప్పింది. భవిష్యత్తులో మరిన్ని ఈ విధమైన వేడుకలను జరుపుకుంటూ ప్రేమ, ఐక్యత, స్నేహభావాన్ని మరింతగా వ్యాప్తి చేద్దాం!




## తొలి మ్యాచ్‌లోనే గోల్డెన్ డక్

ఆస్ట్రేలియా ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ విధ్వంసక ఇన్నింగ్స్‌లకు పెట్టింది పేరు. అతడు క్రీజులో ఉన్నాడంటే బౌలర్లకు వణుకే. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో చిరస్మరణీయ ప్రదర్శనలు చేసిన ఈ ఆసీస్ బ్యాటర్ ఐపీఎల్లో మాత్రం చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. 18వ ఎడిషన్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున ఆడుతున్న మ్యాక్సీ.. 18వ సీజన్ తొలి మ్యాచ్‌లో సున్నాకే వెనుదిరిగాడు. అది కూడా ఎదుర్కొన్న మొదటి బంతికే ఎల్బీగా ఔటయ్యాడు. తద్వారా ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు గోల్డెన్ డక్ అయిన బ్యాటర్‌గా నిలిచాడీ ఆల్‌రౌండర్. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ టైటన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ గోల్డెన్ డకట్ అయ్యాడు. సాయికిశోర్ బౌలింగ్‌లో అజ్మతుల్లా ఓమర్‌జాయ్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన మ్యాక్సీ.. తొలి బంతికే ఎల్బీగా పెవిలియన్ చేరాడు. దాంతో, ఐపీఎల్‌లో 19సార్లు మొదటి బంతికే సున్నా చుట్టేసిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు

## నీటి బకెట్‌లో పడి 13 రోజుల పసికందు మృతి

పదమూడు రోజుల పసికందు నీటి బకెట్‌లో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన విజ్జి, ముదలి మణి దంపతులు ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం బండ్లగూడ ప్రాంతానికి వచ్చారు. అలీనగర్ కాలనీలోని జయ అండ్ కో బిస్కెట్ కంపెనీలో పని చేస్తూ వర్కర్స్ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. ముదలి మణి 13 రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మంగళవారం ఉదయం భర్త పనికి వెళ్లాడు. ముదలి మణి బిడ్డను మంచంపై పడుకోబెట్టి బాత్రూంలోకి వెళ్లింది. కొద్ది సేపటి తర్వాత వచ్చి చూసేసరికి పాప కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురై చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికింది. అనంతరం నీటి బకెట్‌లో పాప పడి ఉన్నట్లు గమనించింది. వెంటనే స్థానికుల సహాయంతో పసికందును ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. 13 రోజుల పసికందు బకెట్‌లో పడే అవకాశం లేదంటూ ఈ ఘటనపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## తగ్గిన బంగారం




ధరలు పరుగులు పెడుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి.. వాస్తవానికి, అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం.. ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతుంటాయి.. ఒక్కోసారి ధరలు పెరిగితే.. మరికొన్నిసార్లు తగ్గుతుంటాయి.. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి.. 26 మార్చి 2025 బుధవారం ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.81,840, 24 క్యారెట్ల పది గ్రాముల గోల్డ్ ధర రూ.89,280 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,00,900 లుగా ఉంది.



## పరువు పోతుందని, ఆ వ్యాధి ఉన్నా కూడా బయట పెట్టలేదన్న సుహాసిని

ఒకప్పటి అందాల నటి సుహాసిని గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. నాలుగు భాషల్లో ఎన్నో విజయాలు అందుకున్న సుహాసిని ఆరు పదుల వయసులోనూ భార్య, తల్లి, నటి, నిర్మాత, దర్శకురాలిగా ప్రేక్షకులని మెప్పించే ప్రయత్నం చేస్తుంది. అయితే సుహాసిని తాను చదువుకునే రోజుల్లో బ్యాంక్ మేనేజర్ కావాలనలని అనుకునేదట. ఆమె నాన్నేమో తనని ఇంజినీర్‌గానో, కలెక్టర్‌గానో చూడాలనుకున్నారు. అమ్మ తనని ఇంగ్లిష్ లెక్చరర్ చేయాలనుకునేది. కానీ అవేవీ కాకుండా.. బాబాయ్ ప్రోత్సాహంతో సినిమాటోగ్రఫీ కోర్సులో చేరిన ఆమె తర్వాత నటిగా మారింది.స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. సుమలత, ఖుష్బూ, రేవతి, లిజీ, రేఖ, పూర్ణిమ.. ఇలా పలువురు హీరోయిన్స్‌తో ఇప్పటికీ మంచి స్నేహం మెయింటైన్ చేస్తుంటుంది సుహాసిని. అయితే సుహాసని చూడడానికి చాలా అందంగా, పద్ధతిగా కనిపిస్తూ అందరి మనసులు దోచుకుంటుంది. 90వ దశకంలో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన ఆమె ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టుగా సపోర్టింగ్ రోల్స్ చేస్తూ అలరిస్తుంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో సుహాసిని ఆసక్తికర విషయాలు వెల్లడించి అందరికి పెద్ద షాక్ ఇచ్చింది. 'నాకు టీబీ సమస్య ఉంది. కానీ ఆ విషయం తెలిసిన తర్వాత కూడా భయంతో ఎవరికి తెలియకుండా జాగ్రత్త పడ్డారను. ఎవరికి ఈ విషయం తెలియకుండా ఆరు నెలల పాటు చికిత్స కూడా తీసుకున్నా అని సుహాసిని తెలిపింది.

## యూజర్లకు షాక్ ఇవ్వబోతున్న టెలికాం కంపెనీలు.. త్వరలోనే పెరగనున్న రీచార్జ్ ధరలు..!



మొబైల్ రీచార్జ్ ధరలు ప్రియం కానున్నాయి. భవిష్యత్‌లో కంపెనీలు టారిఫ్ ధరలు వరుసగా పెంచనున్నాయి. ఆదాయాన్ని మెరుగుపరుచుకునేందుకు కంపెనీలు ధరలను సవరించనున్నాయి. కంపెనీలు ఇప్పటికే 2019 డిసెంబర్, 2021 నవంబర్‌తో పాటు పాటు 2024 జులైలో మూడుసార్లు టారిఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. టెలికాం కంపెనీలు యావరేజ్ రెవెన్యూ పర్ యూజర్‌ను పెంచాలని యోచిస్తున్నాయి. ధరల పెరుగుదల చాలా మంది యూజర్లపై భారం పడనున్నది. అధిక చార్జీల కారణంగా కంపెనీలకు ఆదాయం మరింత సమకూరనున్నది. అయితే టెలికాం రంగం ప్రస్తుతం క్లిష్టమైన దశలో ఉందని ఓ నివేదిక పేర్కొంది. పోటీ తీవ్రత తగ్గిందని.. పెట్టుబడి, కస్టమర్ డేటా వినియోగాన్ని పరిగణలోకి తీసుకుంటే ఇండస్ట్రీ రాబడి ఇప్పటికే చాలా తక్కువగా ఉందని మోతీలాల్ ఓస్వాల్ గతంలో చెప్పింది. ఈ క్రమంలో రాబోయే సంవత్సరాల్లో కంపెనీలు టారిఫ్ ధరలను మరింత పెంచనున్నాయి. ఇదిలా ఉండగా.. స్టార్‌లింక్ భారత్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నది.

## సరైన భాగస్వామి దొరికితే ప్రేమిస్తా: నటాషా

గత ఏడాది భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా, నటాషా విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎవరి పనిలో వారు బిజీగా ఉన్నారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటాషా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ప్రేమకు వ్యతిరేకం కాదని, సరైన భాగస్వామి దొరికితే మళ్లీ లవ్‌లో పడేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కాగా నటాషా విడాకుల తర్వాత తన ఫ్రెండ్ అలెగ్జాండర్‌తో రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.జీవితం ఏం అందించినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. సరైన సమయం వచ్చినప్పుడు సరైన అనుబంధం ఏర్పడుతుందని నమ్ముతున్నాను అని వ్యాఖ్యానించారు. "నమ్మకం, అవగాహనతో నిర్మితమైన అర్థవంతమైన సంబంధాలకు నేను విలువ ఇస్తాను. ప్రేమ నా ప్రయాణాన్ని పూర్తి చేస్తుందని అనుకుంటున్నాను, అంతకుమించి ప్రేమ గురించి నిర్వచించలేం" అని తెలిపారు. ఇక, గత సంవత్సరం తనకు చాలా కష్టంగా గడిచిందని, హార్దిక్ పాండ్యాతో విడాకులు తీసుకోవడం తనను బాధించిందని నటాషా చెప్పారు. సవాళ్లను ఎదుర్కొన్నప్పుడే మరింత రాటుదేలుతామని, సవాళ్లను ఇష్టపడతానని వివరించారు. మనుషులు వయసుతో కాకుండా అనుభవాలతో పరిణతి చెందుతారని నటాషా అభిప్రాయపడ్డారు.

